క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదాతలు



అద్దంకి రూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరక్టర్ చుండూరి మరళీకృష్ణ ప్రోత్సాహంతో నాగసూరి హనుమంతరావు రక్తదానం చేశారు. రోటరీ ద్వారా చేయించిన 144వ రక్తదాన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, ఏజీపీ యర్రమోతు రమేష్‌బాబు, మల్లాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా విష్ణుసహస్ర పారాయణం



చీరాల అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం విష్ణు సహస్రనామ పారాయణం, అర్ధ ఏకాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహిళలచే అర్ధ ఏకాహ పారాయణ చదివారు. అనంతరం దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కమిటీ ప్రతినిధులు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు, నిర్వహణ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన జానపద కళాకారుల శిక్షణ



అద్దంకి రూరల్: జానపద కళాకారుల నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. జైభీమ్ అర్పితం ఫోక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి ప్రారంభించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. శిక్షణ పొందిన వారికి ఉపాధ్యాయుడు ఎల్ మోహన్‌రావు అవార్డులు పారితోషికం, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

26న మహా రుద్రాభిషేకం

బల్లికురవ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని శివాలయం సమీపంలో 26వ తేదీ బధవారం సాయంత్రం మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేమవరంలో వేంచేసి ఉన్న కోటిలింగాల దేవాలయ మహాసాధువులచే సాయంత్రం 6.30 నుంచి గంటపాడు వివిధ రకాల ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు కూడా అభిషేకం చేసుకొనేలా 7 అడుగుల వేప శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నామని మహాదేవుడి సేవలో పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు ప్రకటనలో కోరారు.

బస్సును ఢీకొన్న బైకు



మేదరమెట్ల: ఆర్టీసీ బస్సును బైకు ఢీకొట్టుకోవడంతో ఓవ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన మేదరమెట్లలో గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు మేదరమెట్ల నుంచి ఒంగోలుకు వెళ్తోంది. బస్సు పంతులు మెస్ సమీపానికి రాగానే గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మరావు మేదరమెట్ల నుంచి మోటారు బైకుపై వస్తూ ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో అంకమ్మరావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అధిక కూలి వచ్చేవిధంగా ఉపాధి పనులు

జే.పంగులూరు: అధిక కూలి వచ్చేవిధంగా ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో స్వరూపరాణి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ కూలీలకు ఉపాధి పని చూపించాలని, వారికి కొలతల ప్రకారం పని చూపించి పనికి తగ్గ కూలి వచ్చే విధంగా చేయాలని టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేశారు. పనికి రాని వారికి మస్టర్ వేయడానికి వీలు లేకుండా మొబైల్ యాప్‌లో అప్‌డేట్ ఇచ్చామన్నారు. మండలానికి 150 ఇంకుడు గుంతలు టార్గెట్‌గా నిర్ణయించినందున త్వరాగా నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సంతోషం ఉన్నారు.

కదలని మురుగు.. వదలని రోగాలు

- మురుగు మయంగా గ్రామాలు
- దోమల బెడదతో రోగాలు

బల్లికురవ: గ్రామాలు పారిశద్ధ్యంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటాం.. అంటూ అధికారులు ప్రగల్బాలు పలుకుతుంటారు. కాని ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించదు. స్వచ్ఛ భారత్, స్వర్ణాంధ్ర పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వం ఎక్కడా కూడా సరిగా నిర్వహించి దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వల్లాపల్లి పాతమల్లాయపాలెం గ్రామాల్లో మురుగునీరు ముందుకు కదలనందున రోడ్లపై గుండా ప్రవహిస్తోంది. ఇటీవల ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించారు. సైడు కాలువలు నిర్మించేందుకు నిధులు లేనందున పనులు నిలిచాయి. వల్లాపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఇటీవల వేసిన సిమెంట్ రోడ్లకు సైడు కాలువలు లేనందున మురుగు రోడ్డు పైగుండానే ప్రవహిస్తోంది. మురుగు నిల్వతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇదే పరిస్థితి పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీలో కూడా నెలకొంది. ఇక్కడ సైడు కాలువలు లేవు.

ముందుకు సాగని సైడుకాల్వల పనులు..

పాత మల్లాయపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైడు కాలువలు నిర్మాణానికి పొక్లెయిన్‌తో ఎర్త్ వర్క్ చేపట్టారు. బెడ్ కాంక్రీట్ నిర్మాణ పనులు పూర్తికానందున కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితులకు తోడు మురుగునీరు రోడ్లపై గుండానే ప్రవహిస్తోంది. ఒక వైపు రోజురోజుకు ఎండలు పెరుగుతున్నా మురుగు ఉధృతితో దోమలక ఆవాసం అవుతున్నాయి. దోమల దాడతో ఆయా గ్రామాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు ఉండటంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగు ముందకు కదిలేలా చర్యలతో పాటు సీజన్ జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా పనులు చేయాలని వేడుకుంటున్నారు.



పాతమల్లాయపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



వల్లాపల్లి ఎస్టీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అడ్వకేట్స్ యాక్టులో మార్పులు హేయం

చీరాల రూరల్: న్యాయవాద వృత్తికి విఘాతం కలిగే చర్యలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విరమించుకోవాలని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరవ రమేష్ బాబు పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ తీరును నిరసిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు న్యాయమూర్తులకు లిఖితపూర్వకంగా తెలియజేశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు రమేష్‌బాబు గురువారం విలేకరులతో మాట్లాడుతూ అడ్వకేట్స్ యాక్టులో మార్పులను నిరసిస్తూ దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఆయా బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో తమ విధులు బహిష్కరించి నిరసన తెలపనున్నట్లు చెప్పారు. కొత్తగా రూపుదిద్దుకోనున్న యాక్టులో పొరపాటున ఓడిపోయిన న్యాయవాదిపై కక్షిదారులు కేసులు వేసుకోవచ్చుననే చట్టం తేనున్నారని చెప్పారు. ఇద్దరు న్యాయవాదులు కోర్టులో కేసులు చేసేటప్పుడు ఒక న్యాయవాదికి సరైన సాక్ష్యాధారాలు లేక తప్పనిసరి పరిస్థితులలో ఓడిపోతారని, ఓడిన కక్షిదారులకు పైకోర్టులలో అప్పీలు చేసుకునే అవకాశం ప్రస్తుత న్యాయవ్యవస్థలో ఉందన్నారు. వాటిని కాదని కేసు ఓడిపోయిన న్యాయవాదిపై ఓడిన కక్షిదారులు కేసులు వేసుకునేలా యాక్టులో మార్పులు తీసుకురావాలని చూడటం బాధాకరమైన అంశమన్నారు.

బాలల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి



కుంకలమర్రులో మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీ



కోలలపూడిలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు



చెరుకూరులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శిక్షకులు

మార్టూరు/చినగంజాం/పర్చూరు(చినగంజాం): బాలల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి కార్యక్రమ లక్ష్యమని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ సత్యసాగర్ అన్నారు. మండలంలోని కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్, సమగ్ర శిక్ష సంస్థలు సంయుక్తంగా ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆరు రకాల పాఠశాలలను త్వరలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా 120 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుభద్ర, సూపర్‌వైజర్, పద్మ, సీఆర్పీలు రామారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మొదటి విడత శిక్షణ పూర్తి

➤ విద్యార్థి మంచి భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రంలోనే పునాదులు పడాలని ఎంఈఓ బీ అజయ్ బాబు అన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్పీలు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, కే వాణిశ్రీ, ఎస్ సుమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

➤ పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచడమే సాల్ట్ ముఖ్య ఉద్దేశమని జ్ఞానజ్యోతి శిక్షకుడు బ్రహ్మయ్య అన్నారు. శిక్షణ కార్యక్రమం చెరుకూరు గ్రామంలో నిర్వహించారు. ప్రీస్కూల్ విద్యపై శిక్షకులు బ్రహ్మయ్య, బాలకోటేశ్వరరావు, రాధాలు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రాధ, అంగన్‌వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు.

జే.పంగులూరు: మండలంలోని అంగన్వాడీ టీచర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. చివరి రోజు ఎంఈవో నాగభూషణం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు ఓ ప్రతాప్, బి సుబ్బారావు, ఐసీడీఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్వైజర్ ఎస్ పద్మజ పాల్గొన్నారు.

భాషాభివృద్ధిపై దృష్టి సారించాలి

కుంకలమర్రు (కారంచేడు): చిన్నారులకు చిన్నతనం నుంచే వారి భాషను, మేధస్సును అభివృద్ధి చేసుకొనేలా వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. గురువారం ఆమె మండలంలోని కుంకలమర్రు గ్రామంలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల శారీరక, భాష, మేధాభివృద్ధిపై అవగాహన కల్పించారు. వారికి చిన్నతనం నుంచే మంచి చెడుల వివేచనను కూడా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు వీ బాబూరావు, సీహెచ్ రేణుకాదేవి, హిమబింధు, కారంచేడు సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



బల్లికురవలో జరిగిన ప్రజావేదిక (ఫైల్)

బల్లికురవ: ఉపాధి హామీ పథకంలో 2023–24 సంవత్సరానికి మండలంలోని 21 గ్రామ పంచాయతీలో 1036 పనులకు రూ.13.51 కోట్ల నిధులు ఖర్చుచేశారు. రెండు రోజుల క్రితం బల్లికురవలో జరిగిన బహిరంగ ప్రజావేదిక బాపట్ల జిల్లి డ్వామా పీడీ విజయలక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించపోవడం అవకతవకలు ఉన్నట్లు ఆడిట్ బృందాలు ప్రజావేదిక దృష్టికి తెచ్చాయి. పనుల్లో లోపాలు ఉండటం వల్ల ప్రజా ప్రతినిధులు, కూలీలు, ప్రజలు హాజరు కాలేదు. రూ. 8.01 లక్షలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఏపీవో నుంచి రూ. 4.4 లక్షలు, పర్యవేక్షణ ఏఈ నుంచి రూ. 3.62 లక్షలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ. 7.6 లక్షలు రికవరీ చేయాలని పీడీ నివేదిక అందజేశారు. ఇప్పుడు జరిగే ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులు సూచించారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం



మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి

యద్దనపూడి: ప్రజా సమస్యలు చర్చించాల్సిన అధికారులు మండల సమావేశాన్ని తూతూ మంత్రంగా జరిపి మమ అనిపించారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో రావాల్సిన ఇంటిపన్ను వసూళ్లు నూరుశాతం పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కుమారస్వామి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మార్చి నెలాఖరుకు పన్ను వసూలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పన్ను వసూలు చేయడంతో పాటు వాటిని ప్రభుత్వానికి జమ చేయడం అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పర్చూరు (చినగంజాం): పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అవలంభించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్ర ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులు, పురుగు మందుల డీలర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసవి దుక్కులు దున్నాలని, మిత్ర పురుగులు సంరక్షించుకోవాలని, విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. చీడలను గుర్తించడానికి జిగురు అట్టలను పెట్టుకోవాలని, భూసారాన్ని పెంచుకోవటానికి పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగు, జనుము, పిల్లి పెసర వేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ మధువాణి నేల స్వభావం, నేల రకాలు గురించి వివరించారు. ముఖ్యంగా భూసార పరీక్షలు చేయించుకొని ఏరువులు సమతుల్యంగా వేసుకోవాలని, భాస్వరం ఎరువులు ఆఖరి దుక్కిలోనే వేసుకోవాలని, చౌడు నేలలు వాటి నివారణ గురించి వివరించారు. బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ టీ రత్నకుమారి మాట్లాడుతూ శనగలో వచ్చు పురుగులు, తెగుళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారిణి ప్రేమ రంజితం, రిటైర్డ్ సైంటిస్ట్ టీవీ రామారావు, ఏడీఏ మోహనరావు, ఏవో రామ్మోహనరెడ్డి, ఆదర్శ రైతులు, డీలర్‌లు, ఏఈఓలు, వీఏఏలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కుల పంపిణీలో పాల్గొన్న అధికారులు, లబ్ధిదారులు

కొడవలివారిపాలెం (కారంచేడు): మంజూరు చేసిన రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కే నేతాజీ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొడవలివారిపాలెం గ్రామ పంచాయితీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అవసరమైన రుణాలను చెక్కుల రూపంలో అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పథకంలో భాగంగా అర్హులైన వారిని గుర్తించి మంజూరు చేసిన రుణాలను పంపిణీ చేశామన్నారు. సుమారు రూ.25.40 లక్షల రుణాలు మంజూరు చేశామన్నారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు వ్యాపార నిమిత్తం వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ నాగరాజు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

కారంచేడు: ట్రాఫిక్ రూల్స్‌తో పాటు, వాహన చట్టం నిబంధనలు పాటించని వాహన యజమానులపై చర్యలు తప్పవని ఎస్సై వీ వెంకట్రావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన మండల కేంద్రమైన కారంచేడు ఆర్‌సీఎం చర్చి సమీపంలో వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో అక్రమ తరలింపులు జరుగుతున్నాయా ? వే బిల్లుల ప్రకారం రవాణాలు సక్రమంగా జరుగుతున్నాయా ? లేదా అని పరిశీలించారు. డ్రైవర్లు తీసుకోవాల్సిన నిబంధనలు కూడా ఆయన పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు కూడా హెల్మెట్ లేని ప్రయాణం చేయవద్దన్నారు. తనిఖీలో సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సదరం ధ్రువీకరణ పత్రం తప్పనిసరి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిశ్రీ చరణ్

చినగంజాం: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా సదరం సర్టిఫికేట్ కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పీ సాయిశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం దివ్యాంగులైన చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలందరికి పరీక్షలు నిర్వహించి మొత్తం 28 మంది దివ్యాంగులైన చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. వారికి అవసరమైన వైద్యం, వైద్యాన్ని ఎక్కడ పొందాలో వారికి తెలియజేశారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు వికలత్వ శాతం తెలియజేసే సర్టిఫికేట్‌లను కచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చీరాల లోక్ అదాలత్ కమిటీ సభ్యులు ఏ రామకృష్ణారెడ్డి, పారా లీగల్ వలంటీర్ ఎంపీ రామారావు, హెల్త్‌విజిటర్ జే ఉల్దారాణి, సీహెచ్‌ఓ విజయ లక్ష్మి, ఆశాలు శారమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణతో ఆదాయం



ఘన వ్యర్థాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ కుమారస్వామి

పర్చూరు(చినగంజాం): ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి అదనపు ఆదాయం పొందాలని డీఎల్పీవో ఎన్ కుమారస్వామి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని నూతలపాడు గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఘన వ్యర్థాలను సేకరించిన సమర్థవంతంగా వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. కేంద్రాలు ఈనెల 28వతేదీ లోపు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలు 100 శాతం వసూలు చేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అలసత్వంగా ఉండొద్దని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

23న రేణుకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన రేణుకమ్మ తల్లి దేవర ఆలయం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరులో ఈనెల 23న రాయిణి వారి వంశదేవర రేణుకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఆదివారం వరకు కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. మొదటి రోజు రాయిణి వంశస్థులు సముద్రస్నానం, సాముహిక భోజన కార్యక్రమాలు జరిపారు. రెండో రోజు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి ఆలయంలో సుప్రభాత సేవ, ఉపనిషత్ పారాయణ, మంగళవాయుద్య తోరణాలు, అనుష్టానలములు ఉంటాయన్నారు. అదే రోజు యాగశాల ప్రవేశం, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. మూడో శనివారం ఉదయం 7.30 గటలకు అవాహన దేవతార్చనలు, హోమం, అమ్మవారి ఉరేగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. చివరి రోజు అయిన నాలుగో రోజు ఉదయం 10.30 గంటలకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

23న పర్చూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని రోటరీ భవన్‌లో ఈనెల 23న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తునానట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరపల్లికి చెందిన తోకల తరుణ్, పర్చూరుకు చెందిన కోట శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు ఆర్థిక సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ వైద్య బృందం వైద్య బృందంలో పాల్గొని ఉచిత సేవలు అందిస్తారని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, గొంతు, చెవి, ముక్కు, కళ్లు చర్మవ్యాధులకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

చీరాల: రోటరీ క్లబ్ చీరాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చందలూరి బాలవెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రతినిధులు నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బీ హేమంత్‌కుమార్‌లు కోరారు.